## క్లుప్తంగా

### సమాచార హక్కుకు తూట్లు పొడుస్తున్నారు..

**భద్రాచలంఅర్బన్:** అడిగిన సమాచారం నిర్ణీత సమయంలో ఇవ్వకుండా సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని భద్రాచలం పంచాయతీ కార్యదర్శిపై గోడ్వానా సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు పాయం సత్యనారాయణ ఆరోపణలు చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భద్రాచలం గ్రామ పంచాయతీలో ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు నిర్మించిన, అక్రమ ఇంటి పన్నులు పొందిన వారికి పంచాయతీ కార్యదర్శి ఎటువంటి నోటీసులు జారీ చేసి ఉన్నారో, అక్రమ కట్టడాలపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలపాల్సిందిగా జిల్లా పంచాయతీ అధికారిని సమాచార హక్కు చట్టం కింద కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై జిల్లా అధికారి కార్యాలయం నుంచి భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యాలయానికి దరఖాస్తు చేరినప్పటికీ.. నిర్ణీత సమయంలో కార్యదర్శి సమాచారం ఇవ్వలేదని వెల్లడించారు. సమాచార హక్కు చట్టం కమిషనర్‌ను నియమించాలని, ఇలాంటి విషయాల్లో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో త్వరలోనే పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపారు.

### కళాజాతా ప్రదర్శన

**ములకలపల్లి:** మండల పరిధిలోని జగన్నాథపురంలో శనివారం కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి శీలం శ్రీనివాస్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో.. ప్లాస్టిక్ వాడకంపై ఏర్పడే దుష్ప్రభావాలు, తడి, పొడి చెత్త వేరుచేడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీపీఓ రమాకాంత్.. నీటి విభాగంలో ఇదే గ్రామం జాతీయ అవార్డు సాధించడంపై స్థానిక సర్పంచ్ గడ్డం భవాని, జీపీ కార్యదర్శి ఇబ్రహీంలను ప్రత్యేకంగా అభినందించారు. కళాజాతా బృందంలో లీడర్ బాలకృష్ణ, అర్జునరావు, కృపానందం, స్నేహ, మూసా, నరేందర్ తదితరులున్నారు.

### సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**మణుగూరురూరల్:** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల ఫోరం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం పీవీకాలనీలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకురాలు గడ్డి కనకలక్ష్మి మాట్లాడుతూ.. ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జూన్ 9వ తేదీ వరకు సమస్యపై అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాల సమర్పణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ఉద్యమకారులకు పెన్షన్, ఉచిత బస్సు, ట్రైన్ పాసులు, వడ్డీ లేని రుణాలు, 300 గజాల ఇంటి స్థలం, ప్రభుత్వ పథకాల్లో 20శాతం వాటా కల్పించాలని కోరారు. నామినేటెడ్ పదవులకు అర్హత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఏసు మణి, కె.మంజుల తదితరులు పాల్గొన్నారు.

### మైనారిటీ బంధు ఇవ్వాలి

**అశ్వాపురం:** పేదరికంతో ఇబ్బందులు పడుతున్న ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ బంధు ఇవ్వాలని ముస్లిం మైనారిటీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా డిమాండ్ చేశారు. అశ్వాపురంలోని జామా మసీదును శనివారం ఆయన సందర్శించారు. ముస్లిం మైనారిటీ పెద్దలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ యాకూబ్‌అలీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ చాంద్ పాషా, మండల అధ్యక్షుడు షేక్ సత్తార్, నాయకులు అజీజ్, నాగుల్‌పాషా, జమాల్, ఖాదర్, భారీ తదితరులు పాల్గొన్నారు.

### స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

**దమ్మపేట:** మూల మలుపులు కారణంగా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశంలో ఎమ్మెల్యే చొరవతో స్పీడ్ బ్రేకర్లను శనివారం ఏర్పాటు చేశారు. గత కొద్దిరోజుల వ్యవధిలో మండల పరిధిలోని మల్లారం గ్రామ శివారులోని మూల మలుపుల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాలు జరిగాయి. అందులో భాగంగా ఇద్దరు యువకులు మృతి చెందిన విషయం తెలిసిందే. స్థానిక నాయకులు దారా యుగంధర్ ఈ విషయాన్ని ఎమ్మెల్యే మెచ్చా దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన ఆయన ఆర్‌ఎండ్‌బీ అధికారులతో మాట్లాడారు. సంబంధిత ప్రదేశంలో రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్‌ఎండ్‌బీ జేఈ శ్రీనివాస్, తన సిబ్బందితో మూల మలుపుల్లో ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు.

### హక్కు పత్రాలివ్వాలి

**చర్ల:** క్లయిమ్ నంబర్ ఉన్న పోడు సాగుదారులందరికీ హక్కుపత్రాలివ్వాలని కోరుతూ శనివారం చర్లలో పోడుసాగుదారులు సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ భరణిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కారం నరేష్ మాట్లాడారు. మండలంలోని ఆర్ కొత్తగూడెం, దానవాయిపేట గ్రామాల్లో పోడుసాగు చేసుకుంటున్న సుమారు 40 మంది గిరిజనులకు క్లయిమ్ నంబర్లు మాత్రమే ఇచ్చారని, వారికి హక్కులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని అన్నారు. పోడుదారులు కుంజా వెంకటేశ్వర్లు వీరమ్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# కొన‘కుండ’ ఉండలేరు..

- మట్టికుండలతో శరీరానికి ఉపశమనం
- దుష్ప్రభావాలకు దూరం
- నీటితోపాటు వంటలకూ వినియోగం
- వేసవిలో మరింతగా ఆదరణ



అమ్మకానికి పెట్టిన వివిధ రకాల మట్టి కుండలు

**భద్రాచలంఅర్బన్:** మట్టి కుండలు అనాదిగా వాడుకలో ఉన్నాయి. అల్యూమినియం, స్టీలు, ఇతర పాత్రల ప్రవేశంతో వీటికి ఆదరణ తగ్గింది. ఆధునిక (మెటల్) వంట పాత్రల వాడకం ద్వారా రోగాలు కూడా మనిషిని చుట్టుముట్టాయి. దీంతో మళ్లీ జనం ఆలోచనలో పడ్డారు. ఇప్పుడు వంటకు, తాగు నీళ్లకు కుండలను ఆదరిస్తున్నారు. మట్టివి తిరిగి జన జీవన స్రవంతిలో కనిపిస్తున్నాయి. మట్టికుండలోని నీళ్లు మనస్సుకు హాయిని, శరీరానికి ఉపశమనాన్ని కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నారు.. ఇప్పుడు ఎండల సీజన్. ఒక పక్క ఉక్క పోత, మరో వైపు మండుటెండలు. ఇలాంటి పరిస్థి తుల్లో మట్టి కుండ అనగానే ఎవ్వరికైనా చల్లని నీళ్లు గుర్తుకు వస్తాయి. చలివేంద్రాలు అంటే కూడా మట్టి కుండలే కన్పిస్తాయి. ఈ కుండల్లో నీళ్లు తాగితే వేసవి తాపం తీరుతుంది. అల్కలీన్ లక్షణాలు నీటిలోని పీహెచ్ స్థాయిని సమతుల్యం చేస్తాయని చెబుతారు. జీవక్రియ మెరుగుపడి పొట్టకు ఇబ్బంది లేకుండా చేస్తాయన్న పేరుంది.

అంతేగాకుండా ఖనిజాలు, లవణాలు కూడా అందుతాయి. ఇలా చెప్పుకుంటూ పోతే మట్టి కుండల వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని నిపుణులు చెబుతారు. భద్రాచలంతో పాటు జిల్లాలో వివిధ మండలాల్లో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.బ్రిడ్జి పక్కన స్టాల్స్ వీటిని విక్రయిస్తున్నారు. ఉక్క పోత ఎక్కువగా ఉండడం ఎండలు మండుతుండడంతో వీటి అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. మట్టి కుండ అంటనే చల్లదనానికి మారుపేరు. దీంతో చలివేంద్రాలలో ఎక్కడ చూసినా మట్టి కుండలే కనిపిస్తాయి.

**ఒక్కో సైజుకు ఒక్కో రేటు..**

ప్రతి స్టాల్‌లో ఒక్కో రకం కుండలు ఉంటాయి. వీటితో పాటు ఇంట్లో ఉపయోగించుకోడానికి కూడా మట్టి పాత్రలు ఇక్కడ అమ్ముతున్నారు. ఇక్కడ అమ్ముతున్న ప్రతి కుండ సుమారు రూ.150 నుంచి రూ.200 చొప్పున విక్రయిస్తున్నట్లు వీటి నిర్వాహకులు వెల్లడించారు.

### ఫ్రిజ్ ఉన్నా వీటిపైనే మక్కువ



పల్లెల్లో ప్రజలు ఎప్పుడు కుండలో నీటికే మొగ్గుచూపుతారు. ఇప్పుడు పట్టణ వాసులు సైతం మట్టి కుండల వైపే చూస్తున్నారు. వీటిలో నీళ్లు సహజంగా చల్లబడతాయి. ఆరోగ్యానికి శ్రేయస్కరమని నిపుణులు చెబుతారు. మనిషి నాగరిగత నేర్చుకున్న తర్వాత మొదటి వంట చేసింది మట్టి పాత్రల్లోనే అని చెబుతారు. ఇవి ఇళ్లలో ఉండడానికి ఇప్పుడు జనం ఇష్టపడుతున్నారు. మరో వైపు పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– పరిమి శ్రీనివాసరావు, భద్రాచలం

### కుండ నీరు శ్రేయస్కరం



సాధారణంగా మనిషి శరీరం ఆమ్లస్వభావం కలిగి ఉంటుంది, మట్టి ఆల్కలీన్, కుండనీళ్లు తాగినప్పుడు శరీర ఆమ్ల స్వభావంతో చర్య జరుపుతుంది. సరైన పీహెచ్‌కు దోహద పడుతుంది. భూమి వివిధ ఖనిజ లవణాల సహజ గని, దీని నుంచి వచ్చిన మట్టితో చేసే కుండలు, సామగ్రి ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుంది. ఫ్రిజ్‌లో నిరు తాగడం కారణంగా చిన్న పిల్లలు త్వరగా జబ్బులు పాలవుతున్నారు. కుండ నీరే శ్రేయస్కరం.

– అశోక్ ,భద్రాచలం

### ఆకట్టుకునే వెరైటీలు



మారుతున్న కాలానుగుణంగా కొనుగోలుదారుల అభిరుచులను బట్టి కుండలతో పాటి వివిధ రకాల మట్టి పాత్రలను తయారు చేస్తున్నాం.

నవతరం కూడా వీటిని వినియోగించడానికి మక్కువ చూపుతున్నారు. వీటిని ఇష్టంగా కొంటున్నారు. ఇప్పుడిప్పుడే వీటికి ఆదరణ పెరుగుతోంది. రోజు రోజుకూ బేరం పెతోంది. మట్టి కుండలు పర్యావరణానికి కూడా మేలు. ఎలాంటి హానీ లేదు.

– సంధ్యారాణి, నిర్వాహకురాలు, భద్రాచలం

## ఆర్ఆర్ఆర్ కేంద్రం ఏర్పాటు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు

**మణుగూరురూరల్:** స్వచ్ఛ్ సర్వేక్షణ్- మేరీ లైఫ్ మేరా స్వచ్ పహార్‌లో భాగంగా మణుగూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆర్ఆర్ఎస్ (రెడ్యూస్- రీయూజ్-రీసైకిల్) పేరిట నిరుపయోగ, ఇతరులకు ఉపయోగపడే వస్తు సేకరణ కేంద్రాన్ని శనివారం అంబేడ్కర్ సెంటర్ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న పాత పుస్తకాలు, ప్లాస్టిక్ సామగ్రి, ఇతర వస్తువులను ఆర్ఆర్ఆర్ కేంద్రంలో మెప్మా సిబ్బందికి అందజేయాలని, అందుకు తగిన బహుమతి అందజేస్తామని తెలిపారు. మెప్మా సిబ్బంది సదరు వస్తువులను రీసైకిల్ చేసి.. వాటిని నిరుపేద ప్రజలకు పంపిణీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమం 15రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దండ రాధాకృష్ణ, సమితిసింగారం ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, కుడితిపూడి వెంకటేశ్వరరావు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ ఆడిట్ బృందం పరిశీలన

**బూర్గంపాడు:** ద పయనీర్ అసోసియేషన్ నేతృత్వంలో జీకేఎఫ్ ఆగ్రో ఫారెస్ట్రీ నిర్వహిస్తున్న కార్బన్ క్రెడిట్ ప్రాజెక్ట్‌లను పర్యావరణ ఆడిట్ బృందం శనివారం పరిశీలించింది. అంజనాపురం, సొంపల్లి గ్రామాల్లో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ రైతులకు అదనపు ఆదాయంగా కార్బన్ క్రెడిట్ ప్రోత్సాహకాలను అందిస్తున్న ప్రక్రియను ఆడిట్ బృందం పరిశీలన చేసింది. ఆడిట్ బృందం ప్రతినిధులు షాహిద్, నికిత మిశ్రా, మృదుల్ శ్రీవాస్‌లు రైతులు సాగు చేస్తున్న మామిడి తోటలను పరిశీలించి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీకేఎఫ్ సంస్థ రైతులతో చేసుకున్న కార్బన్ క్రెడిట్ ప్రాజెక్ట్ ఒప్పంద పత్రాలను పరిశీలించారు. ఒప్పంద పత్రాలలోని అంశాలపై రైతులతో జీకేఎఫ్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సంస్థ పనితీరు, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.మరింత మంది రైతులకు ఈ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జీకే ఎఫ్ టెక్నికల్ హెడ్ వంశీకృష్ణ, రవితేజ, రైతులు పండగ రాములు, సతీష్ పాల్గొన్నారు.

### ముమ్మరంగా ఉపాధి పనులు

**అశ్వారావుపేటరూరల్:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల పరిధిలోని పేరాయిగూడెం, ఊట్లపల్లి, వినాయకపురం, నందిపాడు, నారాయణపురం, గుమ్మడవల్లి, కన్నాయిగూడెం, కావడిగుండ్లతోపాటు పలు గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా ఆయా గ్రామాల్లోని చెరువుల్లో, రైతుల పొలాల్లో మట్టి తవ్వకాల పనులు చేపట్టారు. ఈ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరు అవుతున్నారు. పేరాయిగూడెం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం స్థానిక సర్పంచ్ నార్లపాటి సుమతి పరిశీలించి, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### ప్రజాగర్జనకు తరలిరండి

**చర్ల:** జూన్ 4న జిల్లా కేంద్రం కొత్తగూడెంలో జరిగే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు వేలాదిగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు కోరారు. శనివారం చర్లలోని పార్టీ కార్యాలయంలో సభకు సంబంధిత వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 14 నుంచి రాష్ట్రంలోని 119 నియోజవర్గాల్లో ఆందోళనలు, పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న కొత్తగూడెం పట్టణంలో సీపీఐ ప్రజాగర్జన పేరిట బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యుడు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూపా పోతయ్య, నాయకులు కొంగూరు రాము, సాయి, తేజ, ప్రసాద్ పాల్గొన్నారు.

## నికర లాభ మహోత్సవాలు

**బూర్గంపాడు:** సారపాక ఐటీసీ పరిసరాలలోని ఎస్‌బీఐలో శనివారం నికరలాభ మహోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. చీఫ్ మేనేజర్ జనార్దన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు.

ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ జనార్దన శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్‌బీఐ సిబ్బంది పనితీరు, ఖాతాదారుల సహకారంతో ఈ ఏడాది రూ 50,232 కోట్ల నికర లాభం సాధించిందన్నారు. ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ కారా సూచనల మేరకు ప్రపంచ వ్యాప్తంగా అన్ని ఎస్‌బీఐ శాఖలలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్స్ కిషన్, తంబీకుమార్, అకౌంటెంట్ నీలిమ, క్లరికల్ సిబ్బంది సంతోష్, రాజేష్, రుబీన, ఇంద్రజ, శ్రీకాంత్, రమేష్, క్రాంతి, సత్యవతి, ఖాతాదారులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ కార్యాలయంలో మహోత్సవాలను నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

### ముగ్గురిపై కేసు

**అశ్వాపురం:** మండలంలోని మొండికుంటకు చెందిన తులసి వెంకటరమణపై దాడి కేసులో శనివారం ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన కొమరం పవన్, పాయం సమ్మయ్య, పాయం రమేష్ తులసి వెంకటరమణ, ఆయన కుమారుడు మనోజ్‌కుమార్‌ను దుర్భాషలాడి బెదిరించాడు. దీంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జితేందర్ తెలిపారు.

**భద్రాచలంఅర్బన్:** పట్టణంలోని చర్ల రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద శనివారం సాయి అనే వ్యక్తి ఓ యువతిపై అకారణంగా దాడి చేయగా.. యువతి తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

**వేధింపులపై కేసు..**

పట్టణంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన ఓ మహిళ తనను భర్త వేధిస్తున్నాడని చేసిన ఫిర్యాదుతో పోలీసులకు కేసు నమోదు చేశారు. కాలనీకి చెందిన ఉషారాణి మొదటి భర్త అనారోగ్యంతో చనిపోగా, ఆరేళ్ల క్రితం అచ్చయ్యను వివాహం చేసుకుంది. కాగా, కొద్దిరోజులుగా అచ్చయ్య కుటుంబాన్ని పట్టించుకోకుండా మద్యానికి బానిసై ఉషారాణిని వేధిస్తుండడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### వివాహిత అదృశ్యం

**ములకలపల్లి:** భర్త వద్దకు వెళ్తున్నానని బయలుదేరిన వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని రంగాపురానికి చెందిన గడ్డం బాబూరావు కుమార్తె భవానీ ఖమ్మం రూరల్ మండలానికి చెందిన జింకల కిషోర్‌తో ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి మూడు నెలల కుమారుడు ఉండగా భార్యభర్తల గొడవతో ఆమె ఈనెల 16న కొడుకును భర్త వద్ద వదిలి రంగాపురం వచ్చింది. తిరిగి 18న భర్త వద్దకు బయలుదేరి కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశారు.

### సర్వసభ్య సమావేశం

**అశ్వాపురం:** మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ ముత్తినేని సుజాత అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారిగా అధికారులు ప్రగతి నివేదికలు సభ్యులకు చదివి వినిపించారు. సమస్యలపై చర్చించారు. ఎంపీడీఓ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మణిధర్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దిన్, సూపరింటెండెంట్ ఈశ్వర్, యూడీసీ పద్మావతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

### ‘రాము’ నియామకం

**ములకలపల్లి:** వైఎస్సార్‌టీపీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా ములకలపల్లికి చెందిన దూడల కాశీ రామేశ్వరం (రాము) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ప్రచారకమిటీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల వెంకటేశ్వరరావు శనివారం నియామక పత్రాన్ని అందజేశారు.

### ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

**భద్రాచలంటౌన్:** పట్టణంలో హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అభిమాన సంఘం అధ్యక్షుడు షేక్ అజీమ్, డాక్టర్ కృష్ణప్రసాద్, చందు, రాజేష్ పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు

**అశ్వాపురం:** రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులను మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో శనివారం మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు అమ్మితే వారి డీలర్‌షిప్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి షాప్‌లో విత్తనాల ధరలు, స్టాక్‌కు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని, లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా రశీదులు పొందాలని, లైసెన్స్ పొందిన డీలర్ల దుకాణాల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు జితేందర్, సురేష్, వ్యవసాయ అధికారి సాయిశంతన్‌కుమార్, ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో ఎమ్మెల్యే తనిఖీ

**దమ్మపేట:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే సందర్శించి అక్కడి వ్యాధి బాధితులతో మాట్లాడారు. వైద్య సేవల గూర్చి అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవలు, సదుపాయాల్లో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని వ్యాధి బాధితులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, రెడ్డిమళ్ల నాగయ్య పాల్గొన్నారు.



వ్యాధి బాధితురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

## కుడుములపాడులో వైరల్ జ్వరాలు?

**అశ్వారావుపేటరూరల్:** మండల పరిధిలోని కుడుములపాడు గ్రామంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామానికి చెందిన కె.ముత్తమ్మ, రాములు, సీత, శ్రీను, సోడెం రాముడు, కొర్సా మంగరాజు, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.అశోక్, ఎస్.పండుతోపాటు మరికొంత మంది ఈ వైరల్ జ్వరాలతో బాధ పడుతున్నారు. వీరంతా గడిచిన నాలుగు రోజులుగా వైరల్ జ్వరాలతో బాధ పడుతుండగా, వీరిలో కొంతమంది గ్రామీణ వైద్యులను ఆశ్రయించారు. మిగిలిన వారంతా వినాయకపురం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. కాగా గడిచిన కొద్ది రోజులుగా గిరిజన గ్రామంలో జ్వర పీడితులు పెరుగుతుండటంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అకాల గాలి, వర్షాలతో దోమలు వ్యాప్తి పెరిగిందని, వాటి బారిన పడిన వారు వైరల్ జ్వరాలతో బాధ పడుతున్నట్లు తెలిసింది. అయితే, వైరల్ జ్వరాలతో బాధ పడుతున్న వారికి వినాయకపురం పీహెచ్‌సీలో వైద్యులు ఎన్ఎస్-1 పరీక్షలు చేయగా, నలుగురికి పాజిటివ్‌గా వచ్చినట్లు సమాచారం. అయితే గ్రామస్తులు మాత్రం ఇవి డెంగ్యూ జ్వరాలేనని, వైరల్ జ్వరాలుగా చెబుతున్నట్లు భయందోళనకు గురౌతున్నారు. ఇవి డెంగ్యూ లేక వైరల్ జ్వరాలా అన్నది వైద్య శాఖ తేల్చాల్సి ఉంది. దీనిపై మాట్లాడేందుకు స్థానిక వైద్య శాఖ బాధ్యులు స్పందించడం లేదు.

### వైభవంగా బాలాజీ కల్యాణం



బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

**అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలోని బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామునే పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని ఆలయ ప్రధాన పురోహితుడు ప్రసాదాచార్యులు చేతులమీదుగా నిర్వహించారు. విచ్చేసిన భక్తులు వీక్షించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ వనమా గాంధీ కుటుంబ సభ్యులు కల్యాణం, అన్నదానానికి అవసరమైన ఏర్పాట్లను చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ మేనేజర్ రమణ తగిన ఏర్పాట్లను చేశారు.

### సదుపాయాలు కల్పనకు కృషి

**చంద్రుగొండ:** స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎంపీపీ బాణోత్ పార్వతి హామీ ఇచ్చారు. మండల కేంద్రం చంద్రుగొండలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కనకం తనుజా మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. తొలుత పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న సేవలను వివరించారు. సమావేశాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా మీటింగ్ హాల్ భవనం మంజూరు చేయాలని, నాలుగు పడకలు ఉన్న పీహెచ్‌సీ అదనపు గది కావాలని, తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీపీ పార్వతి సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ జి.రేవతి, ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలాజ్యోతి, స్టాఫ్‌నర్స్ శంకరమ్మ పాల్గొన్నారు.

### సద్వినియోగం చేసుకోండి

**మణుగూరురూరల్:** టీఎస్ ఆర్టీసీ దివ్యాంగులకు అందిస్తున్న రాయితీ బస్ పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని రామానుజవరం సర్పంచ్ బాడిశ సతీష్ తెలిపారు. శనివారం రామానుజవరం గ్రామంలో మణుగూరు డిపో ఆధ్వర్యంలో దివ్యాంగులకు రాయితీపై బస్‌పాస్ మేళా నిర్వహించారు. దరఖాస్తు ప్రతులను దివ్యాంగుల బస్‌పాస్‌ల ఇన్‌చార్జ్ ఉపేందర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ బస్ పాస్‌లతో దివ్యాంగులు ఆర్టీసీ బస్సుల్లో 50శాతం రాయితీపై ప్రయాణించవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్నవారందరికి సోమవారం బస్‌పాసులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం శ్రావణి, ఆశావర్కర్లు సునీత, నర్సమ్మ, సత్యవేణి, రమా పాల్గొన్నారు.

### చర్యలు తీసుకోవాలి

**మణుగూరురూరల్:** మండలంలో భూకబ్జాలకు పాల్పడే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర నేత అయోధ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో కొంతమంది భూములను ఆక్రమిస్తూ అక్రమాలకు పాల్పడుతన్నారన్నారు. భూకబ్జాలపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా భూబాధితులు ఉంటే సీపీఐ కార్యాలయంలో నేరుగా తమకు ఫిర్యాదు చేస్తే.. పార్టీ పోరాడుతుందన్నారు.

## జన ఆరోగ్య సమితి సమావేశం

**దుమ్ముగూడెం:** ప్రభుత్వ ఆదేశానుసారం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఎంపీపీ రేసు లక్ష్మి అధ్యక్షతన జన ఆరోగ్య జమితి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లారెడ్డి మాట్లాడుతూ.. దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో నాలుగు హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లు ఉన్నాయని, వాటిలో రోగులకు 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 98 రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. జన ఆరోగ్య సమితి కమిటీలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థల వారిని భాగస్వామ్యం చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీటీసీ కొర్సా చిలకమ్మ, తహసీల్దార్ ప్రతాప్, సర్పంచ్ కల్లూరి దేవి, కణితి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**మహిళలకు అవగాహన**

**మణుగూరురూరల్:** మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో జన ఆరోగ్య సమితి ఆధ్వర్యంలో శనివారం మహిళలకు పోషకాహారం, పారిశుద్ధ్యం, రక్తహీనత, రక్తపోటు, క్యాన్సర్ వంటి అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించి వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు సరస్వతి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ దయామణి, రాంప్రసాద్, జ్యోతి, నాగజ్యోతి, కుమారి, విజయ తదితరులు పాల్గొన్నారు.

**వ్యాధులపై జాగ్రత్తలు చేపట్టండి**

**చర్ల:** వర్షాకాలం సమీపిస్తున్నందున ఎటువంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని చర్ల తహసీల్దార్ బి.భరణిబాబు ఆదేశించారు. జన ఆరోగ్య సమితి సమావేశాల్లో భాగంగా శనివారం మండలంలోని సత్యనారాయణపురం, చర్ల, కొయ్యూరు వైద్యశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా, దోమలు వృద్ధి చెందకుండా సంబంధిత పనులు ప్రారంభించాలన్నారు. గ్రామాల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమాలలో ఎంపీపీ కోదండరామయ్య, ఎంపీటీసీ సభ్యులు మడకం పద్మ, పొడియం ఆదిలక్ష్మి, సర్పంచ్‌లు కాపుల కృష్ణార్జునరావు, సోడి పుల్లయ్య వైద్యాధికారులు శ్రీధర్, దివ్యనయన, మోనిక, శ్రీకాంత్,ప్రసాద్, డీపీఎంఓలు ముత్యాలరావు, సత్యనారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భరణిబాబు